

రామచంద్రగూడలో నిర్వహించిన ఎన్నికల ప్రచార సభలో మాట్లాడుతున్న మంత్రి సబితా ఇంద్రారెడ్డి

# పని చేసే వారినే ఆశీర్వదించండి

**మహేశ్వరం ఎన్నికల ప్రచారంలో మంత్రి సబితా ఇంద్రారెడ్డి**

మహేశ్వరం, నవంబర్ 18: పని చేసే ప్రభుత్వాన్నే ప్రజలు ఆశీర్వదించాలని, సీఎం కేసీఆర్‌తోనే తెలంగాణ అభివృద్ధి సాధ్యమని మంత్రి సబితా ఇంద్రారెడ్డి అన్నారు. శనివారం మహేశ్వరం మండల పరిధిలోని అకాన్‌పల్లి, గట్టుపల్లి, రామచంద్రగూడ, పెండ్యాల, కల్వకోల్, దుబ్బచెర్ల, సుభాన్‌పూర్, అయ్యవారి పల్లి, దిలావర్‌గూడ, గాంధీనగర్ తాండ, కోళ్లపడకల్, పోరండ్ల గ్రామాల్లో జడ్పీ చైర్‌పర్సన్ తీగల అనితా హరినాథ్‌రెడ్డితో కలిసి మంత్రి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా మంత్రి సబితా ఇంద్రారెడ్డి మాట్లాడుతూ.. నియోజకవర్గంలో కాంగ్రెస్ అభ్యర్థిని ప్రజలు చిత్తు చిత్తుగా ఓడించాలని పిలుపునిచ్చారు. ఎల్లప్పుడూ ప్రజాసేవ చేస్తున్న నియోజకవర్గం ఆడబిడ్డగా తనను దీవించి ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరారు. నియోజవర్గాన్ని ఇప్పటికే అన్ని రంగాల్లో అభివృద్ధి చేశానని, ఇంకా ఎంతో చేయాల్సి ఉందన్నారు. తెలంగాణ రాక ముందు గ్రామాలు ఎట్లుండే.. ఇప్పుడు ఎట్లయినయ్.. ప్రజలు ఒకసారి ఆలోచించాలన్నారు. ప్రతి ఇంటికి మంచి నీరు, సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. పనిచేసే ప్రభుత్వానికి ప్రజలు పట్టం కట్టాలన్నారు. తెలంగాణకు కాంగ్రెస్, బీజేపీలు ఏం చేశాయని ఓట్లు అడగడానికి వస్తున్నారని.. ప్రజలు నిలదీయాలని పిలుపునిచ్చారు. ఆ పార్టీల నాయకుల మాయమాటలు నమ్మి ఓటేస్తే గోస పడతామన్నారు.

# ముస్లింల సంక్షేమానికి బీఆర్ఎస్ కృషి

- ముస్లిం మైనార్టీల ఆత్మీయ సమ్మేళనంలో హోంమంత్రి మహమూద్ అలీ
- కంటోన్మెంట్‌లో లాస్యనందితను భారీ మెజార్టీతో గెలిపించాలి

కంటోన్మెంట్, నవంబర్ 18: బీఆర్ఎస్ ప్రభుత్వం ముస్లిం మైనార్టీల సంక్షేమానికి కృషి చేస్తున్నదని రాష్ట్ర హోంమంత్రి మహమూద్ అలీ అన్నారు. కంటోన్మెంట్‌లో బీఆర్ఎస్ అభ్యర్థి లాస్యనందితకు ముస్లిం మైనార్టీలు మద్దతుగా నిలిచి.. భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. శనివారం కంటోన్మెంట్‌లోని బోయిన్‌పల్లి తెలంగాణ గార్డెన్‌లో బీఆర్ఎస్ అభ్యర్థి లాస్యనందిత, ఎన్నికల ఇన్‌చార్జి ఎంఎన్ శ్రీనివాస్, బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జక్కుల మహేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో నియోజకవర్గ ముస్లిం మైనార్టీల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సమ్మేళనానికి హోంమంత్రి హాజరై మాట్లాడుతూ.. ముస్లిం మైనార్టీల అభివృద్ధి, సంక్షేమానికి సీఎం కేసీఆర్ పెద్దపీట వేశారన్నారు. కంటోన్మెంట్ నియోజకవర్గ అభివృద్ధి కోసం దివంగత ఎమ్మెల్యే సాయన్న ఎంతో కృషి చేశారన్నారు. కాంగ్రెస్, బీజేపీలు ముస్లింలను పట్టించుకోలేదని, మోదీ పాలనలో ముస్లింలు తీవ్ర నిర్లక్ష్యానికి గురయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. కానీ తెలంగాణలో సీఎం కేసీఆర్ ముస్లింల సంక్షేమానికి బడ్జెట్ కేటాయించి, కడుపులో పెట్టుకుని కాపాడుకుంటున్నారని హోంమంత్రి వెల్లడించారు. రేవంత్‌రెడ్డి ఆర్ఎస్ఎస్ భావజాలాలు కలిగిన వ్యక్తి అని ఆరోపించారు. ముస్లిం విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడానికి సీఎం కేసీఆర్ ఎన్నో రెసిడెన్షియల్ పాఠశాలలు నెలకొల్పారన్నారు. పేద ముస్లిం విద్యార్థులు విదేశాల్లో చదువుకోవడానికి రూ.20 లక్షల సాయం అందజేస్తున్నట్లు తెలిపారు. ముస్లింలకు షాదీ ముబారక్ ఇచ్చిన ఘనత సీఎం కేసీఆర్‌దేనని తెలిపారు. ఇమామ్, మౌజన్‌లకు గౌరవవేతనం ఇచ్చారని గుర్తు చేశారు. మైనార్టీలకు అన్నివిధాల అండగా నిలిచిన కేసీఆర్ వెంటే మైనార్టీలు ఉన్నారని స్పష్టం చేశారు.



కంటోన్మెంట్ నియోజకవర్గ ముస్లిం మైనార్టీల ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న హోంమంత్రి మహమూద్ అలీ, చిత్రంలో బీఆర్ఎస్ అభ్యర్థి లాస్యనందిత

## భారీ మెజార్టీతో గెలిపించండి : లాస్యనందిత

సీఎం కేసీఆర్ ముస్లింల సంక్షేమానికి పెద్దపీట వేశారని కంటోన్మెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి లాస్యనందిత అన్నారు. ముస్లిం విద్యార్థులకు రెసిడెన్షియల్ స్కూల్స్ స్థాపించి సీఎం కేసీఆర్ అండగా నిలిచారన్నారు. ఈ సారి కూడా ముస్లింలు కారు గుర్తుకు ఓటేసి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. తనను గెలిపిస్తే.. కంటోన్మెంట్ ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండి సమస్యలు పరిష్కరిస్తానని చెప్పారు. ఈ సందర్భంగా మైనార్టీ నాయకులంతా బీఆర్ఎస్‌కు సంపూర్ణ మద్దతు ప్రకటించారు. గులాబీపార్టీ వెంట నడుస్తామని ప్రతినబూనారు. ఈ ఆత్మీయ సమావేశంలో రాష్ట్ర బెవరేజెస్ కార్పొరేషన్ చైర్మన్ గజ్జెల నాగేశ్, కంటోన్మెంట్ బోర్డు మాజీ సభ్యులు అనితా ప్రభాకర్, నళిని కిరణ్, సీనియర్ నాయకులు మసీఉల్లాఖాన్, హరి, టీఎన్ శ్రీనివాస్, నర్సింహ ముదిరాజ్‌తో పాటు పలువురు నాయకులు, బీఆర్ఎస్ మైనార్టీ విభాగం నాయకులు, ఉద్యమకారులు, పార్టీ అనుబంధ సంఘాల సభ్యులు, మహిళా నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# బీఆర్ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యం

**మల్కాజిగిరి ఎమ్మెల్యే అభ్యర్థి మర్రి రాజశేఖర్ రెడ్డి**

మల్కాజిగిరి, నవంబర్ 18 : బీఆర్ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యమని మల్కాజిగిరి ఎమ్మెల్యే అభ్యర్థి మర్రి రాజశేఖర్ రెడ్డి అన్నారు. శనివారం అల్వాల్, నేరేడ్‌మెట్, మల్కాజిగిరి, మౌలాలి డివిజన్‌లలో ప్రచారం చేశారు. ఈ సందర్భంగా మర్రి రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ... రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలు ఆర్థికంగా ఎదగడానికి బీఆర్ఎస్ ప్రభుత్వం సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నదన్నారు. కుల వృత్తుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తున్నదని తెలిపారు. దళితబంధు పథకం ద్వారా నియోజకవర్గంలోని దళితులకు ఒక్కొక్కరికి రూ.10లక్షలతో స్వయం ఉపాధి యూనిట్లను ఏర్పాటు చేశామన్నారు. దళితబంధు పథకం నిరంతరం కొనసాగుతుందని, దరఖాస్తు చేసుకున్న వారికి ఆర్థిక సహాయం అందజేస్తామన్నారు. సొంత స్థలం ఉన్నవారికి ఇంటి నిర్మాణం కోసం రూ.5లక్షలు, ఇండ్లు లేనివారికి డబుల్ బెడ్ రూంలు అందజేస్తామని పేర్కొన్నారు. గెలిచిన తరువాత రూ.400లకు గ్యాస్ సిలిండర్, సన్న బియ్యం అందజేస్తామని చెప్పారు. ప్రజలు బీఆర్ఎస్ పార్టీ కారు గుర్తుకు ఓటువేసి గెలిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు శాంతిశ్రీనివాన్ రెడ్డి, సబితాకిశోర్, అనిల్‌కిశోర్, నాయకులు చింతల శ్రీనివాస్ రెడ్డి, నిర్మలరెడ్డి పాల్గొన్నారు.



అల్వాల్ డివిజన్‌లో మ్యానిఫెస్టో పత్రాన్ని అందజేస్తున్న అభ్యర్థి మర్రి రాజశేఖర్ రెడ్డి

# అభివృద్ధి, సంక్షేమానికి ఆకర్షితులై చేరికలు

**ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్**

కాచిగూడ:నవంబర్ 18: రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలు కావడంతో ప్రజలు బీఆర్ఎస్ పార్టీని ఎంతగానో ఆదరిస్తున్నారని అంబర్‌పేట ఎమ్మెల్యే అభ్యర్థి కాలేరు వెంకటేశ్ అన్నారు. సంక్షేమ పథకాలకు ఆకర్శితులై బీఆర్ఎస్ నాయకుడు శేషుపేరి ఆధ్వర్యంలో గోల్నాక డివిజన్ కృష్ణానగర్ ప్రాంతానికి చెందిన 240 మంది బీజేపీ నాయకులు ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. వీరికి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాలేరు మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజా పరిపాలన కొనసాగుతున్నదని, సీఎం కేసీఆర్ పరిపాలనకు జేజేలు పలుకుతున్నారని పేర్కొన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం చేపడుతున్న అనేక సంక్షేమ పథకాలను గడప గడపకు తీసుకెళ్లాలని కార్యకర్తలకు ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. రాజకీయాలకు అతీతంగా ప్రజలకు సంక్షేమ పథకాలు అందజేస్తున్నామని చెప్పారు. పార్టీ కోసం కష్టపడే వారికి తగిన గుర్తింపు ఉంటుందని పేర్కొన్నారు.



బీఆర్ఎస్‌లో చేరిన నాయకులతో ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్

# బండ్లగూడ ట్రాఫిక్ సమస్యను పరిష్కరిస్తా

**ఎల్బీ నగర్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి**

మన్సూరాబాద్, నవంబర్ 18: బండ్లగూడ చౌరస్తా పరిసర ప్రాంతాల్లో రోజురోజుకు పెరుగుతున్న ట్రాఫిక్ సమస్యను పరిష్కరించేందుకు ప్రణాళికలు సిద్ధం చేశామని బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి తెలిపారు. నాగోల్ డివిజన్ బండ్లగూడ పరిధి ఇంద్రప్రస్థ కాలనీలో మాతృభూమి ఉత్సవ కమిటీ సిటిజన్ డెవలప్‌మెంట్ ఫోరం ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనానికి సుధీర్ రెడ్డి హాజరై మాట్లాడారు. దేశంలో ఎక్కడా లేని విధంగా పేద ప్రజల సంక్షేమానికి సీఎం కేసీఆర్ ఎన్నో పథకాలను ప్రవేశపెట్టారన్నారు. సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్‌ల చొరవతో నగర రూపురేఖలు మారిపోయాయని తెలిపారు. నగరంలోని ప్రధాన కూడళ్లలో గంటల కొద్దీ వేచి చూడాల్సిన దుస్థితి నుంచి ప్రజలకు విముక్తి కల్పించేందుకు వేలాది కోట్లతో ఫ్లైఓవర్లు, అండర్‌పాస్ రోడ్ల నిర్మాణాలు చేపట్టారని చెప్పారు. నగర అభివృద్ధి యథావిధిగా కొనసాగేందుకు నవంబర్ 30న జరిగే ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ చెరుకు సంగీత, డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు తూర్పాటి చిరంజీవి, నాయకులు అనంతుల రాజిరెడ్డి, గోల్కొండ మైసయ్య, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.



ఇంద్రప్రస్థ కాలనీలో ఏర్పాటు చేసిన ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

# రాజేంద్రనగర్‌లో బీఆర్ఎస్ విజయం ఖాయం

శంషాబాద్ రూరల్, నవంబర్ 18 : రాజేంద్రనగర్‌లో బీఆర్ఎస్ విజయం ఖాయమని బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్ అన్నారు. శనివారం శంషాబాద్ మండలంలోని పలు గ్రామాల్లో జడ్పీటీసీ తన్విరాజు, ఎంపీపీ జయమ్మ, వైస్ ఎంపీపీ నీలంనాయక్, మండల పార్టీ అధ్యక్షుడు కే చంద్రారెడ్డిలతో కలిసి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్ మాట్లాడుతూ... తెలంగాణ వచ్చిన తరువాత సీఎం కేసీఆర్ అధ్వర్యంలో గ్రామాల అభివృద్ధి కోసం కోట్లాది నిధులు కేటాయించి అభివృద్ధి చేశారని తెలిపారు. బహదూర్‌గూడలోని రైతులకు పట్టాదారు పాస్‌బుక్కులు ఇప్పించడానికి సీఎం కేసీఆర్ దృష్టికి సమస్యను తీసుకుపోయినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకుడు గణేశ్ గుప్త, నీరటి రాజుముదిరాజ్, సర్పంచ్‌లు సతీశ్‌యాదవ్, పద్మావతి అనంతరెడ్డి, రాంగోపాల్, సుజాత, రాణిరవి, పీఏసీఎస్ చైర్మన్లు సతీశ్, దవణాకర్‌గౌడ్, శ్రావణ్‌గౌడ్,ఎంపీటీసీ యాదగిరి, ప్రధాన కార్యదర్శి మోహన్‌రావు, రవీందర్‌నాయక్, కృష్ణయ్యగౌడ్, మండల పార్టీ ఉపాధ్యక్షుడు శ్రీకాంత్‌గౌడ్ పాల్గొన్నారు.



బహదూర్‌గూడలో ప్రజలకు అభివాదం చేస్తున్న ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్